
సింగిల్ పేజీ కథ

# 'రచైత'



కె. విశాల

ఏసుదాసు పుస్తకాల పురుగు. కనిపించిన ప్రతి పుస్తకం మస్తకం పెట్టి సమస్తం చదువుతాడు. చాలా పత్రికలు కొంటాడు. కొన్ని అద్దెకు తెచ్చుకుంటాడు.

రాసే వాళ్ళంటే... దాసుకు అపారమైన గౌరవం. ఎందుకంటే అతను కాలేజీ రోజుల్లో ఓ కథ రాద్దామని ప్రయత్నించాడు. రీములకొద్దీ కాగితాలు వేస్టుఅయ్యాయి కానీ... సంతృప్తికరంగా ఒక్కపేజీ రాయలేక పోయాడు. ఎన్నో నెలలు గడచినా రాయడం రాలేదు. అప్పటినుండి రచనలు చేయడం ఒకవరం అనుకుని దండంపెట్టి వాటి జోలికి పోవడం మానేశాడు. అడపాదడపా లెటర్లు రాద్దామని ప్రయత్నించీ దాంట్లోకూడా పెద్దగా విజయం సాధించలేక పోయాడు.

రైటర్లను కలవాలనీ, వాళ్ళు ఎలా రాస్తారో కనుక్కోవాలనీ విపరీతమైన కోరిక అతనికి.

ఓ రోజు ఓ వార పత్రికలో 'చెవిలో పువ్వు' అనే కథ చదివాడు. అది ఒక ప్రముఖ రచయితైన కలంశ్రీ రాసింది. ఆశ్చర్యం కొద్దీ... ఆ కథతోపాటూ అతగాడి అడ్రస్... ఫొటోకూడా ఇచ్చారు.

అతగాడు ఆశ్చర్యం కొద్దీ ఇతగాడి ఊళ్ళోనే ఉంటున్నాడు.

దాసు ఉక్కిరి బిక్కిరి అయిపోతాడు. కలంశ్రీగారి కలం పోటుకి ఇతడు చాలాసార్లు బలి అయ్యాడు. అతనితో ముఖాముఖి ముచ్చటించాలని ముచ్చట పడ్డాడు.

రెక్కలు కట్టుకోకుండా... ఆ సాయంత్రం అమాంతంగా కలంశ్రీని వెతుక్కుంటూ వచ్చి వాలాడు దాసు.

"నమస్కారం గురూగారు..." వినయంగా చెప్పాడు. అతని చంకలో ఓ వార పత్రిక ఉంది.

"కూర్చోండి... మీ పేరు"... ఎందుకొచ్చావన్నట్లు పలకరించాడు.

"నా పేరు దాసండి.... ఈ ఊళ్ళో ఫలానా ఆఫీసులో పనిచేస్తున్నాను. నేను మీ అభిమానిని" చెప్పాడు.

"వ్వాట్... ఈ ఊళ్ళో కూడా నా కథలు చదివే వాళ్ళున్నారా!" ఆశ్చర్యపోయాడు కలంశ్రీ.

"మీ 'చెవిలో పువ్వు' అనే కథ చదివాను! చాలా బాగుంది. అద్భుతం... మీలాగా 'చెవిలో పువ్వు' ఎవరూ పెట్టలేదు. సారీ రాయలేదు...'సింప్లీ సూపర్బ్!' చెప్పాడు.

"చెవిలో పువ్వా! దేన్లో వచ్చింది" అడిగాడు తాపీగా రచైత.

"అరె! మీకు తెలీదా... ఫలానా పత్రికలో నిన్ననే వచ్చింది. చూడలేదా"... ఆశ్చర్యానందాలతో అడిగాడు.

"లేదు... చూడలేదు." తాపీగా చెప్పాడు కలంశ్రీ.

"అంటే... ఆ పత్రిక కొనలేదా?"

"లేదు."

"చాలా బాగుంది... మీ స్నేహితులు ఎవరూ చూసి చెప్పలేదాండి" ఇంకా అనుమానం తీరక అడిగాడు.

"ఆ! చూసే ఉంటారు. అంతగా పట్టించుకొని ఉండరు" చెప్పాడు.

"మీ ఫ్రెండ్స్ భలేగున్నారే! నాకయితే ఆ కథ చదివిన దగ్గర్నుండీ మిమ్మల్ని ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఆత్రం కలిగింది."

"థాంక్స్! ఆ కథ మిమ్మల్నిఅంతగా కదిలించిందన్నమాట!" చిరునవ్వు నవ్వాడు.

"మీరు అసలు ఏ పత్రికా చదవరా?" దాసు అడిగాడు.

"చదువుతాను... అప్పుడప్పుడు" ముక్తసరిగా చెప్పాడు.

"పోనీ... ఏ పత్రికా రెగ్యులర్‌గా కొనరా!'

"అబ్బో! పత్రిక కొనాలంటే... మాటలా ఈ కాలంలో! బోల్డు ఖరీదు... పైగా వేస్టు" చప్పరించాడు రచైత.

"అయితే మీ కథ పడితే ఎలా? ఎవరన్నా చెబితే కొంటారా." విస్మయంగా అడిగాడు.

"ఛీ!ఛీ! కొనడం దేనికి?... కాంప్లిమెంటరీ కాపీ పంపిస్తారుగా. అది భద్రం చేసుకుంటాను" చెప్పాడు కలంశ్రీ.

"ఆ! అది ఒకవేళ పోస్టులోపోతే..." సందేహించాడు.

"చేరకపోతే... రాస్తానుమళ్ళీ... మరొక కాపీ పంపమనీ"

"అంటే... కాంప్లిమెంటరీ కాపీ కోసం చూస్తారుకాని... మీరు మటుకు డబ్బులు పెట్టి పత్రిక కొనరు" అన్నాడు.

"ఆ! మరి... ఊరికే డబ్బు లెందుకు దండగ చేసుకోవాలి చెప్పండి"నవ్వాడు రచైత కలంశ్రీ.

"సారీ! కలంశ్రీగారూ. పొరపాట్న మీ కథ పడ్డ పత్రిక కొన్నాను. ఇంకెప్పుడూ ఇటువంటి పొరపాటు చేయను. కథలు రాసే మీకే పత్రిక కొనడం దండగ అనిపించినపుడు మాకేమనిపించాలి?"

"అబ్బే! నాకెలాగూ పంపిస్తారుగా... మళ్ళీ ఎందుకు కొనాలి" కలంశ్రీ అన్నాడు.

"సారీ! రాసేవాళ్ళే పత్రికలు కొని... పత్రికల మనుగడ ప్రోత్సహించనపుడు... పాఠకులకేం పట్టింది... వాటిని ప్రోత్సహించడానికి!... మీకే పత్రిక మీద ఇలాంటి అమూల్యాభిప్రాయాలుంటే మీ'బోడి కథల్ని' మేమెందుకు చదవాలి?" విసవిసా వెళ్ళిపోయాడు దాసు.

కలంశ్రీ అవాక్కయ్యాడు. ★